క్లుప్తంగా

వైభవంగా శ్రీపుష్పయాగం

బోట్‌క్లబ్: స్థానిక మెహర్‌నగర్‌లో అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి 50వ వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయ ప్రధానార్చకులు పున్నమరాజు శ్రీనివాసాచార్యులు కమలాకర్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి, సాయంత్రం శ్రీపుష్పయాగం నిర్వహించారు. అనంతరం పవళింపుసేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లిపూడి వెంకటేష్ కుమార్తెలు శ్రీయ, అక్షయ భక్తిగీతాలు ఆలపించారు. ఈ నెల 30 తేదీ వరకు ప్రతిరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలసంబరం జరుగుతాయని చివరి రోజు 31వ తేదీ ఆదివారం మధ్యాహ్నం మహాన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి హోమం, ప్రాతఃకాల పూజ, గోపూజ, స్వామి వారికి విశేష అభిషేకములు, సహస్ర నామార్చన, దీపారాధన సేవ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లోని మరకత మణికంఠ పీఠంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

యూనియన్ ఐక్యతతో సమస్యల పరిష్కారం



తురగా సూర్యారావును సత్కరిస్తున్న నాయకులు

బాలాజీచెరువు: యూనియన్ ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని ఏపీ పోస్టల్ ఎన్ఎఫ్‌పీఈ సర్కిల్ కార్యదర్శి బి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయంలో ఆదివారం తపాలా గ్రూప్-సి, పోస్ట్‌మాన్, ఎంటీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధులను చిత్తశుద్ధితో నిస్వార్థంగా నిర్వహించాలని సూచించారు. యూనియన్‌లో సీనియర్ నాయకుల పోరాట పటిమను, వారు సాధించిన విజయాలను వివరించారు. అనంతరం పోస్టల్ పెన్షనర్స్ ఉద్యోగుల కాకినాడ సంఘ అధ్యక్షులు తరుగా సూర్యారావును సత్కరించారు.ఈకార్యక్రమంలో తపాలా ఉద్యోగులు,పెన్షనర్స్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: రక్తదానం ప్రాణదానంతో సమానమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక టౌన్ హాల్లో ఆదివారం ఎల్‌బీఎన్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువత సేవా కార్యక్రమాల ద్వారా ముందుకు రావడం అభినందనీమన్నారు. తొలి రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌కు అందించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంకుర్ సురానా భవిష్యత్తులో తమ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథి బాదం బాలకృష్ణ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ సిరాజ్, ట్రెజరర్ సతీష్, ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ కామరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంతో క్షయ నివారణ

కాకినాడ రూరల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంతో క్షయ వ్యాధిని అధిగమించవచ్చని ఆర్ఎంపీ వైద్యుడు కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు.

నడకుదురులో కూటమి ప్రచారం

కరప: నడకుదురు గ్రామంలో ఆదివారం కాకినాడ రూరల్ నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హెల్దీగా హోలీ..

- రసాయన రంగులతో అప్రమత్తం
- అనారోగ్య, వ్యాధులకు కారకం
- ప్రకృతి సిద్ధ రంగుల పొడులతో ఆరోగ్యం



పువ్వులు, ఆకులు, కాయగూరలు తదితర వస్తువులతో హోలీ రంగు పొడుల తయారీ..

కాకినాడ సిటీ: కాముని దహనం మరుసటి రోజు చిన్నా పెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగితేలుతూ హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం సాంకేతిక అభివృద్ధి.. బిజీ లైఫ్‌తో ఎవరూ సహజ రంగులతో కాకుండా మార్కెట్‌లో లభిస్తున్న కృత్రిమ రంగులతో హోలీ ఆడుతూ అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఈ రసాయన రంగుల వల్ల చర్మ సంబంధ వ్యాధులతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. వాటికి బదులు గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుగు పూల పొడితో తయారు చేసిన రంగులను హోలీలో ఉపయోగించడం వల్ల చర్మానికి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

నిర్లక్ష్యాన్ని వీడాలి

హోలీ కుటుంబంలో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా.. ఏదో ఒక చోట చెరువులు, కాలువలు, గోదావరి, సముద్రం వద్దకు స్నానాలకు వెళ్లి యువత మృత్యువాత పడుతున్నారు. జలాశయాల వద్ద సెల్ఫీలు, సరదాలకు పోయి, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అజాగ్రత్తగా, మద్యం సేవించి నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు–సలహాలు

హోలీ ఆడడానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం.

- ఎరుపు రంగు కోసం బీట్‌రూట్, మోదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి.
- పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరలు మిశ్రమం వాడొచ్చు.
- సహజ రంగుల్లో లభించే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ వ్యాధులను నియంత్రించి, చర్మాన్ని మృదువుగా చేస్తాయి.

కృత్రిమ రంగులతో ఇబ్బందులు

- నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.

కృత్రిమ ఆకుపచ్చ రంగులో కాపర్ సల్ఫేట్‌తో అనారోగ్యం రావచ్చు

- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.
- నీలి రంగు చర్మ సంబంధ, వ్యాధులు, మెర్క్యురీ సల్ఫేటు (ఎరుపు) క్యాన్సర్‌కు కారణమవుతాయి.
- పౌడర్లు, గులాల్, లెడ్, క్రోమియం, నికెల్, మెర్క్యురీ, కాపర్, జింక్, వినికిడి లోపం, ఎలర్జీ, ఆయాసం, మొదలగు దుష్ప్రభావాలకు దారితీస్తాయి.

సహజ రంగులే వాడాలి


హోలీ వేడుకల్లో సహజ రంగులనే వాడాలి. రసాయన రంగులు కళ్లలో పడితే చూపు దెబ్బతింటుంది. ప్రకృతిలో లభించే పూలు, ఆకులు, ఇతరత్రా వాటితో తయారయ్యే రంగులను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కూడా కాపాడినట్టే.

ఎం.రామ్మోహన్, సామాజికవేత్త, కాకినాడ

రసాయన రంగులు వాడొద్దు


పండగ మోజులో రసాయనాలను కలిపిన రంగులను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్లే. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది తప్పదు. రంగులు కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు. స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. సహజసిద్ధ రంగులతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, మండల వైద్యాధికారి, కరప

ద్వారంపూడి వెంటే శెట్టిబలిజలు

ఘనంగా వెంకటరెడ్డి జయంతి


దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ కౌండిన్య శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి 171వ జయంతిని ఆదివారం సాంబమూర్తినగర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ పెద్దలు మాట్లాడుతూ నగరంలో శెట్టిబలిజలకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. వారికి ఒక కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు వీలుగా స్థలాన్ని కేటాయించడమే కాకుండా శంకుస్థాపన చేశారన్నారు. సంఘానికి కేటాయించిన స్థలంలో మొట్టమొదటిగా దొమ్మేటి వెంకటరెడ్డి జన్మదినాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వెంటే తాము ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కాకరపల్లి చంద్రశేఖర్, కడియాల సూర్యనారాయణ, గుత్తుల మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొని వెంకటరెడ్డికి నివాళులర్పించారు.

ఘనంగా ముసాలమ్మ, సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


వాకాడ గ్రామ దేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం వాకాడలో గ్రామదేవతలు ముసాలమ్మ, సోమాలమ్మతల్లుల విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ఆలయం లేక ఊరిచివర ఒకచెట్టు మొదలులో అమ్మవార్లు ఉండేవారు. గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షల టీటీడీ నిధులు మంజూరు చేయగా, గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. సంపర గ్రామశిల్పి డేగల శ్రీరాములు (సాయిబాబు) అమ్మవార్ల విగ్రహాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దాతలు ముమ్మారెడ్డి సీతమ్మ, సత్యం కుమారుడు కృష్ణమోహన్‌చౌదరి, పద్మశ్రీ దంపతులు ఆలయానికి 10 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు అడబాల బుచ్చిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ప్రవాసాంధ్రుడు పులి రామలింగేశ్వరరావు, వివిధగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ మతాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో 125కు పైగా దేవాలయాలను అభివృద్ధి చేసినట్టు ఆయన తెలిపారు. శిల్పి శ్రీరాములును, స్థలదాత ముమ్మారెడ్డి కృష్ణమోహన్‌చౌదరిలను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలోని రామాలయం వద్ద ప్రారంభించిన 5వ శ్రీరామ సప్తాహాన్ని ఎమ్మెల్యే కన్నబాబు సందర్శించి పూజలు చేశారు.

హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే

- ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించండి
- బాబు గ్యారెంటీ, వారెంటీలను నమ్మకండి
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: చెప్పాండటే.. చేస్తాడంతే అని ప్రజల్లో విశ్వాసం సంపాదించుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చారని, ఎన్నికల కోసం గ్యారంటీ, వారంటీ అంటున్న చంద్రబాబు, ఆయన పొత్తు పార్టీలను నమ్మవద్దని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ 2వ డివిజన్‌కు చెందిన సుమారు 200 మంది టీడీపీ, జనసేన నుంచి కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ డివిజన్ ఇన్‌చార్జి పాటి సూరిబాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేరడంతో వారికి పార్టీ కండువాలను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కరోనా కష్టకాలంలోన సీఎం జగన్ ఎంతో సాయం చేశారన్నారు. గత ఎన్నికల ముందు మీ బంగారం బ్యాంకుల నుంచి తెచ్చుకోవచ్చని మహిళలను నమ్మించి చంద్రబాబు మోసం చేశారన్నారు. 2009 నుంచి తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి మీలో ఒకడిగా ఉన్నానన్నారు. జీవితంలో సంతృప్తి ఇచ్చేలా నియోజకవర్గంలో 120 ఆలయాలు నిర్మించామన్నారు. రమణయ్యపేటలో పాడుబడిన నూకలమ్మ ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అమ్మవారే ఈ అవకాశం ఇచ్చారని భావిస్తున్నారు. నియోజకవర్గంలో 31వేల ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశామన్నారు. తమ నేత జగన్‌నే ఒక గ్యారంటీ అన్నారు. చంద్రబాబు పండగ కానుక అని బెల్లం ముక్క ఇస్తే మన భవిషత్ కోసం ఇల్లు, వాకిలి అన్ని జగన్ ఇస్తున్నారన్నారు. జనసేన నేత పవన్‌కళ్యాణ్ హుందా తనం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేందుకు తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో కాకరపల్లి కృష్ణ, కందికట్ల అప్పారావు, ప్రసాద్, పిల్లి మణి, వాసంశెట్టి పవన్, త్రినాథబాబు, కందికట్ల శైలజ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొప్పిశెట్టి రమణ, గుత్తుల సూర్య ప్రకాష్, అయ్యప్ప, నాని, నాగు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి


తిమ్మాపురంలో కవాతు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు, తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు, సిబ్బంది

- సీఐ శ్రీనివాసరావు
- కేంద్ర బలగాలతో కవాతు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో కేంద్ర దళాలతో కలిసి తిమ్మాపురం పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రవీంద్రబాబు ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఆవేశాలకు లోనవ్వవద్దన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీనియర్ సిటిజన్లకు సౌకర్యాలు కల్పించండి


కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కాకినాడ సిటీ: ప్రసిద్ధ దేవాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. కాకినాడ సూపర్ బజార్ ఆవరణలో కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో సీనియర్ సిటిజన్ల హక్కులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. తిరుపతి, అన్నవరం సహా ప్రసిద్ధ దేవాలయాలలో సీనియర్ సిటిజన్ల ప్రవేశానికి ప్రత్యేక సదుపాయం కల్పించాలని వక్తలు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శివాజీ గణేష్, జేఎస్‌వీ ప్రసాద్, వియ్యూరి రామ సుబ్బారావు, ఆర్ఎస్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


గొర్రిపూడిలో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న చిన్నారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పామ్ సండే అనేది ఈస్టర్‌కు ముందు పవిత్ర వారం మొదటిరోజున క్రైస్తవులు చేసుకునే వేడుక. ఇది యేసు విచారణ, సిలువ మరణాన్ని గుర్తు చేస్తుంది. తాటి కొమ్మలు (ఈత మట్టలు) మంచి తనాన్ని, విజయాన్ని సూచిస్తాయి. గాడిద శాంతి, వినయానికి గుర్తు. మార్చి 31 ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చిలకు సంబంధించిన పాస్టర్లు, చర్చి నాయకులు, యూత్, మహిళలు, పురుషుల ఆధ్వర్యంలో ఈత మట్టలను రకరకాల పూలతో అలంకరించి వాటిని చేత పట్టుకుని నగర వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. నగరంలో అర్బన్ ఎంఆర్ఓ భవన్ సమీపంలోని క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, రామారావు పేటలోని సెయింట్ లూథరన్ చర్చి, గాం. దీనగర్‌లోని హౌస్‌ఆఫ్ ప్రేయర్, ఆంధ్రాబాప్టిస్టు చర్చి, జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, చీడీల పొర లోని షాలోమ్ ప్రేయర్ హౌస్, రిజర్వ్‌లైన్స్ పోలీస్ క్వాటర్స్ బాప్టిస్టు చర్చి తదితర చర్చిల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ డి.వరప్రసాద్, సంఘ నాయకులు, రిజర్వ్‌లైన్స్ పోలీస్ యూనియర్ చర్చి పాస్టర్ ఎం.చంద్రపాల్, హౌస్‌ఆఫ్ ప్రేయర్‌లో పాస్టర్ విజయ్‌కుమార్, గాం. దీనగర్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బీవీ రాజు తదితరుల ఆధ్వర్యంలో ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కరపలో..

కరప: మండలంలో చిన్నారులు, క్రైస్తవులు మట్టలు చేతపట్టి శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని గ్రామాల్లోని చర్చిలలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు, సెక్రటరీ డాక్టర్ పి.శామ్యూల్‌రాజు, ట్రెజరర్ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఏసురత్నం, జాయింట్ సెక్రటరీ ఎస్.భరత్ కుమార్, కె.శేఖర్‌మోజెస్, జిల్లా జాయింట్ సెక్రటరీ రెవరెండ్ ఐ.జాన్‌ప్రకాష్, చైర్మన్ డాక్టర్ స్టీఫెన్‌బాబు తదితరులు ప్రార్థనలు చేశారు.

ఘనంగా చండీహోమం

పెద్దాపురం: మరిడమ్మ తల్లి ఆలయంలో ఆదివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనారావు ఆధ్వర్యంలో వేద పండితులు ఐవీ ప్రసాద్ శర్మ, ఎస్‌వీ శాస్త్రి, ఏవీ భానుమూర్తి హోమాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో కామాడి సత్యవతి (58) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై మణికుమార్ ఆదివారం రాత్రి తెలియజేశారు. తాళ్లరేవు మండలం లక్ష్మీపతి నగరం గ్రామానికి చెందిన సత్యవతి తన కుమార్తె వద్ద తూరంగి మహాలక్ష్మి నగర్‌లో ఉంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం మోతాదుకు మించి మాత్రలు వేసుకుంది. ఆ ప్రభావంతో గాబరా వచ్చి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. కుమార్తె కర్రి లోవలక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్సై భీష్మకుమార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రసాయనాలు ఫుల్.. ఆరోగ్యం కిల్

- గ్రామాల్లోని చెరువుల్లో రసాయనాల వినియోగం
- నాచుజాతి మొక్కలను చంపేందుకు వాడకం
- కలుషితమవుతున్న జలాలు
- పట్టించుకోని అధికారులు


వాకతిప్ప చెరువులో రసాయనాల వినియోగంతో రంగుమారిన నీరు, చనిపోయిన నాచుమొక్కలు

పిఠాపురం: గ్రామాల్లోని చెరువుల్లో కొంతమంది చేపల పెంపకం దారులు నాచుజాతి మొక్కలను చంపేందుకు రసాయనాలను వినియోగిస్తున్నారు. దీంతో చెరువులు పూర్తిగా కలుషితమవుతున్నాయి. రసాయనాలు వినియోగించిన చెరువుల్లో నీటిని పశువులు సైతం తాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఈ చెరువుల్లో చేపలను తిన్న ప్రజలు సైతం అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. చెరువుల్లో నాచుమొక్కలు తొలగింవలసి ఉండగా వ్యాపారులు మాత్రం రసాయనాలతో ఆ మొక్కలను చంపుతున్నారు.

మండలంలో ఇలా...

కొత్తపల్లి మండలంలోని ఎండపల్లి, రమణక్కపేట, కొమరగిరి, ఇసుకపల్లి, కుతుకుడుమిల్లి శివారు పెద్ద కలవలదొడ్డి, వాకతిప్ప గ్రామాల్లోని చెరువుల్లో నాచుమొక్కలు చంపేందుకు రసాయనాలు వినియోగించారు. దీంతో చెరువుల్లోని నాచు మొక్కలు చనిపోవడంతో పాటు చెరువులో పెరిగే చేపలపై కూడా ఇది విష ప్రభావం చూపుతోందని స్థానికులు చెబుతున్నారు.

నిబంధనలకు నీళ్లు

నిబంధనల ప్రకారం పశువులు నీరు తాగే చెరువులు, చేపల చెరువుల్లో ఎటువంటి రసాయనాలు ఉపయోగించరాదు. ఈ రసాయనాలు ఉపయోగించడం వలన ప్రజలు ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అయినప్పటికీ చెరువుల లీజుదారులు ఎటువంటి అనుమతులు లేకుండా విష ప్రభావం ఉన్న రసాయనాలు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో ఆయా చెరువుల్లో నీటిని పశువులు తాగడం లేదు. నీటి వాసన చూసి తాగకుండా వెళ్లిపోతున్నాయని పాడి రైతులు చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వలన పశువులు కూడా అనారోగ్యం బారిన పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు పట్టని వైనం

చెరువుల్లో విషపూరిత రసాయనాలు, మృత జీవుల వ్యర్థాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువుల లీజు వ్యాపారుల నుంచి అధికారులకు మామూళ్లు అందుతున్నాయని, దీంతో వారు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రసాయనాలు వినియోగించరాదు

చేపల పెంపకం దారులు లీజుకు తీసుకున్న పంచాయతీ చెరువుల్లో ఎటువంటి రసాయన మందులు వినియోగించరాదు. దీనివలన నీరు కలుషితమవుతుంది. ఈ చెరువుల్లో చేపలు తినడం వలన ప్రజలకు కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. చేపల చెరువుల్లో రసాయనాలు వినియోగించే వారికి నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వాకతిప్ప

ఎండుగడ్డికి గిరాకీ

కోటనందూరు: వ్యవసాయంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చాక వరి ఎండుగడ్డికి గిరాకీ పెరిగింది. వరిపంటను మెషీన్‌తో కోయిస్తే పశువులు తినిడానికి అనువైన ఎండుగడ్డి వచ్చే పరిస్థితి ఉండదు. మెట్ట ప్రాంతమైన కోటనందూరు మండలంలో అవసరం మేర కూలీలు అందుబాటులో ఉండడంతో వరిని యంత్రాలతో కోసే పరిస్థితి లేదు. దీంతో ఈ ప్రాంతంలో ఎండుగడ్డి రైతుల అవసరానికి మించి ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. ఈ ప్రాంతంలో ఏటా జనవరి నుంచి ఏప్రిల్ వరకూ వరికుప్పలు నూర్పిడి చేయడం పరిపాటి. ప్రస్తుతం కోనసీమతో పాటు ఇతర ప్రాంతాలకు ప్రతిరోజూ ఇక్కడ నుంచి భారీగా ట్రాక్టర్లపై ఎండుగడ్డిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.12 వేల నుంచి దూరాన్ని బట్టి రూ.20 వేల వరకూ పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. అవసరానికి మించి అందుబాటులో ఉన్న రైతులు గడ్డిని విక్రయిస్తున్నారు.

నూకాలమ్మ పూలగరగ ఉత్సవం

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పూల గరగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ కమిటీ పర్యవేక్షణలో గరగలను ఊరేగించారు. గరగలపై భక్తులు కొత్త చీరలను పాన్పుగా వేసి అనంతరం వాటిని ధరిస్తే శుభకరమని భావిస్తుంటారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.